అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



పిల్లలతో కలిసి ఫుట్‌బాల్ ఆడిన ప్రధాని

5

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక -349 బుధవారం 29 ఏప్రిల్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



# గ్రోత్ ఇంజిన్‌గా గూగుల్


- గూగుల్ ..ఎపికి గేమ్ ఛేంజర్
- దేశానికి ఎపి డేటా గేట్‌వేగా నిలుస్తుంది
- 2028 నాటికి గూగుల్ సెంటర్ పూర్తి
- ఎంఓయూలతోనే కాదు..వాటిని ముందుకు తీసుకెళ్తున్నాం
- గూగుల్ సెంటర్‌కు శంకుస్థాపనలో సిఎం చంద్రబాబు

**విశాఖపట్నం,,ఏప్రిల్ 28.(జర్నలిస్ట్ వార్త)** గూగుల్ రాక.. విశాఖకే కాదు.. ఏపీకి ఒక గేమ్ ఛేంజర్ అని సీఎం చంద్రబాబు అన్నారు. ఏపీ చరిత్రలో మరచిపోలేని రోజు ఇదన్నారు. భారతదేశానికి ఏపీ..అంతర్జాతీయ డేటా గేట్‌వేగా నిలుస్తుంది. విశాఖలోని తర్లువాడలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ నిర్మాణానికి భూమి పూజ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం**మిగతా 2లో...**

## గూగుల్ తో మారనున్న విశాఖ ముఖచిత్రం

### సరికొత్త చరిత్రకు నాంది పలికాం

గూగుల్ సెటంర్ కార్యక్రమంలో లోకేశ్



డబుల్ ఇంజిన్ సర్కార్‌తో రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యశాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఏపీలో ప్రయోజనాలు చూపిస్తున్నామని పేర్కొన్నారు. మంగళవారం తర్లువాడలో రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు సీఎం చంద్రబాబు భూమిపూజ**మిగతా 2లో...**

## నేడు పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికలు

రెండోదశలో 142 స్థానాలకు పోలింగ్

ఓటరు చేతిలో 1,448 మంది అభ్యర్థుల భవితవ్యం

మే 4న తుది ఫలితాలు



**కోల్‌కతా :,ఏప్రిల్ 28.(జర్నలిస్ట్ వార్త)** పశ్చిమబెంగాల్‌లో బుధవారం రెండోదశ పోలింగ్ జరగనున్నది. ఏడు జిల్లాల పరిధిలోని 142 నియోజకవర్గాల్లో ఉన్న సుమారు 3.21 కోట్ల మంది ఓటర్లు 1,448 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్ణయించనున్నారు. ఈ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు మే 4న జరుగుతుంది. మొదటి దశ పోలింగ్‌లో 90 శాతానికి పైగా ఓటింగ్ నమోదై రికార్డు సృష్టించింది.**మిగతా 2లో...**

## తెలంగాణ పోలీస్ సారథి సీవీ ఆనంద్

- నూతన డీజీపీగా నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- 30న ప్రస్తుత డీజీపీ శివధర్‌రెడ్డి ఉద్యోగ విరమణ
- అదే రోజు లేదా మే1న ఆనంద్ బాధ్యతల స్వీకరణ!



**హైదరాబాద్,ఏప్రిల్ 28.(జర్నలిస్ట్ వార్త)** తెలంగాణ రాష్ట్ర పోలీస్ విభాగానికి కొత్త డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జీఓ ఆర్టీ నం.553 జారీ చేసింది. ప్రస్తుతం హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీగా**మిగతా 2లో...**

## ఇంధన భయం..

- ధరలు పెరుగుతాయనే ఆందోళన, కొరత భయాలు..
- పెట్రోల్ బంకుల వద్ద కిలోమీటర్ల క్యూ
- వివిధ రాష్ట్రాల్లోని ఎన్నికల తర్వాత ధరలు పెరుగుతాయనే ఆందోళన
- పలు పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు
- సైబరాబాద్ పోలీస్ పెట్రోల్ బంకు వద్ద బారులు తీరిన కార్లు

**హైదరాబాద్ ,ఏప్రిల్ 28.(జర్నలిస్ట్ వార్త)** వివిధ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు పూర్తవుతుండటంతో ఇంధన ధరలు పెరుగుతాయనే ఆందోళనతో పాటు పెట్రోల్, డీజిల్ కొరత భయాలతో హైదరాబాద్ నగరంలో వాహనదారులు పెట్రోల్ బంకుల వద్ద వరుస **2లో...**



## 70 నిముషాల్లోనే ప్రయాణం

### అమరావతి - హైదరాబాద్ మధ్య బుల్లెట్ ట్రైన్

చంద్రబాబు విజినరీ లీడర్ -కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్

**విశాఖపట్నం, ,ఏప్రిల్ 28.(జర్నలిస్ట్ వార్త)** చంద్రబాబు నేతృత్వంలో విశాఖపట్నం త్వరలోనే ఐటీపట్నం కాబోతోందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. విశాఖలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. అమరావతి - హైదరాబాద్ మధ్య బుల్లెట్ ట్రైన్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాల రాజధానుల మధ్య 70 నిమిషాల్లో, చెన్నై నుంచి అమరావతికి 112 నిమిషాల్లో ప్రయాణం సాధ్యమవుతుందని వివరించారు. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 2 గంటల 08 నిమిషాల్లో ప్రయాణం చేయవచ్చన్నారు.**మిగతా 2లో...**



## భావితరాల కోసమే ఫ్యూచర్ సిటీ

- మరో సింగపూర్‌ను సృష్టిస్తాం..
- ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తాం
- నిరుద్యోగ యువతకు
- ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం
- ఫ్యూచర్‌సీటీలో కలపమని సమీప గ్రామాల నుంచి వినతులు వస్తున్నాయి
- పోలీస్ కమిషనరేట్ భవన నిర్మాణానికి శంకుస్థాపనలో సీఎం రేవంత్‌రెడ్డి
- 20మంది మావోయిస్టులకు టూరిస్ట్‌గైడ్‌లుగా నియామకపత్రాలు

**కందుకూరు,ఏప్రిల్ 28.(జర్నలిస్ట్ వార్త)**భవిష్యత్ తరాల కోసమే ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని సీఎం ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. దీన్ని మరో సింగపూర్‌గా తీర్చి దిద్ది, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టిస్తామన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను అమలు చేస్తుందని స్పష్టంచేశారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట్ రెవెన్యూ పరిధిలో ఫ్యూచర్‌సిటీ పోలీస్ కమిషనరేట్ భవనానికి **మిగతా 2లో...**



## ఇరాన్ శాంతి ప్రతిపాదనలకు రష్యా మధ్యవర్తిత్వం



- చర్చలపై ఇరాన్ సమాలోచనలు
- అగమ్యగోచరంగా అమెరికా పరిస్థితి
- ముందుకెళ్తే చైనా..వెనక్కొస్తే ఇరాన్
- యుద్ధంలో ఇరుక్కున్న ట్రంప్
- ఒపెక్, ఒపెక్ ప్లస్‌కు యూఏఈ గుడ్‌బై

**టెహ్రాన్/వాషింగ్టన్ : ,ఏప్రిల్ 28.(జర్నలిస్ట్ వార్త)** రష్యా అందిస్తున్న మద్దతుకు, సంఘీభావానికి ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ కృతజ్ఞతలు తెలిపారు. అరాగ్చీ సోమవారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో సమావేశమైన విషయం తెలిసిందే. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలను నివారించే విషయంలో **మిగతా 2లో...**

# గ్రోత్ ఇంజిన్‌గా గూగుల్




,మొదటిపేజీ తరువాయి

గూగుల్‌కు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. గూగుల్ ఏఐ డేటా సెంటర్.. ఏపీ టెక్నాలజీతోపాటు దేశానికే గ్రోత్ ఇంజిన్‌గా మారుతుందన్నారు. టెక్నాలజీ హబ్‌కు భవిష్యత్‌లో తుర్లవాడ పేరు మార్మోగుతుందన్నారు. టెక్నాలజీలో ఏపీ సగర్వంగా తలెత్తుకొని నిలబడుతుంది. కొత్త ఆవిష్కరణలకు ఆంధ్రప్రదేశ్ ఎప్పుడూ స్వాగతం పలుకుతుంది. ఏఐ డేటా సెంటర్ ఒక గిగావాట్ సామర్థ్యంతో పని చేస్తుంది. సెర్చ్ ఇంజిన్‌గా మొదలైన గూగుల్.. ఇప్పుడు భారత్ గ్రోత్ ఇంజిన్‌గా మారబోతోంది. ప్రముఖ సంస్థలు విశాఖలో పెట్టుబడులకు రావడం శుభపరిణామం. గూగుల్ ఆవిష్కరణలు.. ఏపీ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ రెండూ కలుస్తున్నాయి. ఓడరేవుల వంటి రంగాల్లో పని చేస్తున్న ప్రతిష్ఠాత్మక సంస్థ అదానీ.. ప్రజలకు కమ్యూనికేషన్‌తో అనుసంధానం చేస్తున్న మరో సంస్థ ఎయిర్‌టెల్.. ఈ మూడు సంస్థలు ఎప్పుడూ నూతన ఆలోచనలు చేస్తుంటాయన్నారు. 2028 సెప్టెంబర్ నాటికి గూగుల్ ఏఐ డేటా సెంటర్ నిర్మాణం పూర్తి కావాలి. రెండు, మూడు నెలలు ముందుగానే పూర్తి చేసేందుకు సహకరిస్తాం. జులైలో భోగాపురం ఎయిర్‌పోర్టును జాతికి అంకితం చేస్తాం. భవిష్యత్‌లో అనకాపల్లి జిల్లా మరో రంగారెడ్డి జిల్లాగా మారుతుంది. వ్యాపార నిర్వహణ ఖర్చు.. మిగిలిన నగరాలకంటే చాలా తక్కువగా ఉంటుంది. జూన్ 1న దక్షిణ కోస్తా రైల్వేజోన్ ప్రారంభమవుతుందని అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. ఎంవోయూలకే పరిమితం కాదు.. ముందుకు ఎలా తీసుకెళ్లాలో చూపిస్తున్నాం. పెట్టుబడులు, ఒప్పందాలే కాదు.. ప్రారంభంలోనూ ముందున్నాం అని చంద్రబాబు అన్నారు. అలాగే విశాఖకు గూగుల్ రాక ఉత్తరాంధ్రకే గర్వకారణమని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. ఆసియాలోనే అతిపెద్ద డేటా సెంటర్ ఏర్పాటవుతోందని తెలిపారు. విశాఖను గూగుల్ ఎంపిక చేసుకోవడం ఏపీకి గర్వకారణమని వ్యాఖ్యానించారు. గూగుల్, ఎయిర్‌టెల్ రెండూ కీలక సంస్థలని వెల్లడించారు. సెప్టెంబర్ 2028 నాటికి గూగుల్ డేటా సెంటర్ పూర్తవుతుందని స్పష్టం చేశారు. అతి త్వరలో అన్నిరంగాల్లో ఏఐ సేవలు వస్తాయని వివరించారు. 60 రోజుల్లో అనకాపల్లి, విశాఖపట్నానికి గోదావరి నీళ్లు వస్తాయని చెప్పుకొచ్చారు. గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. విశాఖకు అద్భుతమైన కనెక్టివిటీ ఉందని తెలిపారు. 2028 చివరినాటికి ఆర్సెలార్ మిట్టల్ ప్లాంట్ తొలిదశ పూర్తి చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఏఐ సిటీగా విశాఖ ఉంటుందని.. తెలిపారు. టెక్నాలజీలో దేశానికే గేట్‌వేగా ఆంధ్రప్రదేశ్ ఉందని వెల్లడించారు. పెట్టుబడిదారులే ఏపీకి భాగస్వాములని చెప్పారు. ఒప్పందాలే కాదని.. గ్రౌండింగ్ కూడా తమదే బాధ్యత అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## ఏఐ యుగంలో గూగుల్ డేటా సెంటర్ కీలకం

### గ్లోబల్ ఏఐ ఎకానమీ దిశగా ఆంధ్రప్రదేశ్ పరుగులు

### గూగుల్ క్లౌడ్, గ్లోబల్ ఇన్‌ఫ్రా వైస్ ప్రెసిడెంట్ బికాస్ కోలే

: ఆనందపురం మండలం తర్లువాడలో గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు శంకుస్థాపన జరిగింది. మంగళవారం ఉదయం కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భూమి పూజ చేశారు. వన్ గిగా వాట్ సామర్థ్యంతో రూ.1.35 లక్షల కోట్ల భారీ పెట్టుబడితో మెగా డేటా సెంటర్‌ను గూగుల్ సంస్థ ఏర్పాటు చేయనుంది. డేటా సెంటర్‌కు తర్లువాడ, అడవివరం, రాంబిల్లిలో మొత్తం 600 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. అన్ని రకాల అనుమతులను సర్కార్ క్లియర్ చేసింది. ఈ సందర్భంగా గూగుల్ క్లౌడ్, గ్లోబల్ ఇన్‌ఫ్రా వైస్ ప్రెసిడెంట్ బికాస్ కోలే మాట్లాడుతూ... గూగుల్ ఇండియా ఏఐ హబ్‌కు ఇవాళ చేసిన శంకుస్థాపన 2047 వికసిత్ భారత్‌కు ఓ పునాదిరాయి లాంటిదన్నారు. ఏఐ యుగంలో విశాఖలో ఏర్పాటు చేస్తున్న ఈ డేటా సెంటర్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. భారత డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లోనూ ఈ డేటా సెంటర్ అత్యంత ముఖ్యమైనదని చెప్పుకొచ్చారు. గ్లోబల్ ఏఐ ఎకానమీ దిశగా ఇప్పుడు విశాఖ, ఆంధ్రప్రదేశ్ పరుగులు పెడుతోందని అన్నారు. ఇంటర్నేషనల్ సబ్ సీ గేట్ వేగా ఉన్న ముంబై, చెన్నైలతో పాటు విశాఖ కూడా కీలకంగా మారిందని వెల్లడించారు. కొత్త ఫైబర్ ఆప్టిక్ లైన్లు ఇతర ప్రాంతాలతో విశాఖను అనుసంధానం చేస్తాయని బికాస్ కోలే తెలిపారు. సముద్ర గర్భ లైన్లతో సంప్రదాయ నౌకాయాన మార్గాలు ఇక డిజిటల్ ట్రేడ్ రూట్లుగా మారతాయన్నారు. అదానీ కనెక్స్, ఎయిర్ టెల్ నెక్స్ట్రాలు ఈ డేటా సెంటర్ ఏర్పాటులో భాగస్వామ్యం వహిస్తున్నందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇండస్ట్రియల్ కారిడార్‌గా ఎదుగుతున్న ఈ ప్రాంతానికి టెక్ ఫ్యూచర్‌ను అందించేలా ఈ డేటా సెంటర్ ఉంటుందని చెప్పారు. స్థానిక యువతకు ఉద్యోగ భద్రత, ఇంధన భద్రత, నీటి వినియోగం లాంటి అంశాలతో స్థానిక భాగస్వామ్యంతో ముందుకు అడుగులు వేస్తామన్నారు. యువతకు భవితను అందించేలా వారికి అడ్వాన్స్‌డ్ క్లౌడ్, ఏఐలో శిక్షణ కార్యక్రమాలను గూగుల్ నిర్వహిస్తుందని తెలిపారు. 10 వేల మందికిపైగా మహిళలకు మైక్రో ఎంటర్‌ప్రైజ్‌గా మారేందుకు సహకారం అందిస్తుందని అన్నారు. న్యూ ట్రాన్స్ మిషన్ లైన్లు, ఎనర్జీ స్టోరేజి సిస్టమ్స్ లాంటివి ఈ ప్రాంతానికి ఇంధన భద్రతను కల్పిస్తాయన్నారు. విశాఖలోని వివిధ నివాస ప్రాంతాలు, పర్యావరణ పరిరక్షణతో పాటు ఈ ప్రాంతానికి ఆర్థిక స్థిరత్వం కల్పించేలా ఈ డేటా సెంటర్ నిర్మితం అవుతుందని బికాస్ కోలే వెల్లడించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాస్ వర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు లోకేశ్, అనిత, బాల వీరాంజనేయ స్వామి, సంధ్యారాణి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, ఎంపీలు, గూగుల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## సరికొత్త చరిత్రకు నాంది పలికాం

చేశారు. ఈ కార్యక్రమంలో గూగుల్ క్లౌడ్ సంస్థ ప్రతినిధులు, కేంద్రమంత్రులు అశ్విని వైష్ణవ్, కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాసవర్మ, హోంమంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. ఈ డేటా సెంటర్‌కు తర్లువాడ, రాంబిల్లి, అడవివరంలో 600 ఎకరాలను ఏపీ సర్కార్ కేటాయించింది. ఈ కార్యక్రమంలో పాల్గొని మంత్రి లోకేశ్ మాట్లాడారు. విశాఖ అంటే గూగుల్ అని మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు ఒకలెక్క.. ఇక నుంచి మరో లెక్క అని చెప్పుకొచ్చారు. ఇవాల్టి నుంచి విశాఖ ముఖచిత్రం మారబోతోందని తెలిపారు. సరికొత్త చరిత్రకు ఇవాళ పునాదిగా మారిందని వెల్లడించారు. ఇకపై డేటా ఏఐ హబ్‌గా విశాఖపట్నం మారుతోందని వివరించారు. పెట్టుబడులతో ఏపీ కొత్త చరిత్ర సృష్టిస్తోందని ఉద్ఘాటించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలోని ఐదేళ్లు ఏపీలో విధ్వంస పాలన చూశామని విమర్శించారు. గూగుల్ ప్రాజెక్టు తెచ్చిందెవరని గూగుల్‌ని అడిగితే చంద్రబాబు పేరే చెబుతోందని అన్నారు. వైసీపీ పాలనలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు భయపడ్డారని ఆరోపించారు. తమది గూగుల్.. వైసీపీది గొడ్డలి.. బోత్ ఆర్ నాట్ సేమ్ అని చెప్పుకొచ్చారు. నమో అంటే నాయుడు.. మోదీ అని మంత్రి లోకేశ్ అభివర్ణించారు.

# 70 నిముషాల్లోనే ప్రయాణం

మొదటిపేజీ తరువాయి

చెన్నై నుంచి కోల్‌కతా మధ్య రైల్వే లైన్లను 4 లేన్లుగా విస్తరించే పనులు చేపడతామని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.

గతంలో చంద్రబాబు సైబరాబాద్ నిర్మించారని.. ఐటీ అభివృద్ధిలో సైబర్ టవర్‌ది కీలకపాత్ర అని చెప్పుకొచ్చారు. చంద్రబాబు విజన్‌కు సెల్యూట్ చేస్తున్నామని అన్నారు. ఆయనను దేశం గర్వించే విజనరీ లీడర్‌గా కేంద్రమంత్రి అభివర్ణించారు. యువనేత లోకేశ్ ఎనర్జీ, నాయకత్వం అద్భుతమని కొనియాడారు. సమస్యల పరిష్కారంలో యువనేతలకు లోకేశ్ ఆదర్శమని పేర్కొన్నారు. తయారీ రంగంలో నూతన ఆవిష్కరణలు వస్తున్నాయని, భవిష్యత్తులో ఎలక్ట్రానిక్స్ తయారీ అత్యంత కీలకమని అశ్విని వైష్ణవ్ అన్నారు. ఎలక్ట్రానిక్స్ తయారీలో భారత్ కీలకపాత్ర పోషిస్తుందని చెప్పారు. 2024 నుంచి సెమీకండక్టర్ల తయారీపై కేంద్రం దృష్టి సారించిందని తెలిపారు. గూగుల్ వంటి ప్రముఖ సంస్థలు విశాఖపట్నానికి రావడం శుభపరిణామమని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. జూన్ 1 నుంచి విశాఖపట్నం రైల్వే జోన్‌ను నోట్ఫై÷ చేస్తామని కేంద్ర మంత్రి ప్రకటించారు.

## నేడు పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికలు

మొదటిపేజీ తరువాయి

ఈ మేరకు ఎన్నికల సంఘం(ఈసీ) విస్తృతమైన భద్రతా ఏర్పాట్లను చేపట్టింది. ఏడు జిల్లాల్లో కలిపి 2,321 కంపెనీల కేంద్ర బలగాలను మోహరించి ంది. కోల్‌కతాలో బలగాల మోహరింపు అధికంగా ఉంది. ఇక్కడ 273 కంపెనీల బలగాలు మోహరించాయి. మొత్తం 142 మంది సాధారణ పరిశీలకులు, 95 మంది పోలీసు పరిశీలకులు, 100 మంది వ్యయ పరిశీలకులను నియమించారు.

ఓటర్ల పరంగా చూస్తే..

రెండో విడతలో భాగంగా మొత్తం 3.21 కోట్ల మంది ఓటర్లలో.. 1.64 కోట్ల మంది పురుషులు, 1.57 కోట్ల మంది స్త్రీలు, 792 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారు. భౌగోళిక విస్తీర్ణం పరంగా ఎన్నికలకు వెళ్తున్న నియోజకవర్గాల్లో అత్యంత చిన్నది కోల్‌కతాలోని జోరాసంకో కాగా, అత్యంత పెద్దది నదియాలోని కళ్యాణి. ఓటర్ల సంఖ్య పరంగా అత్యంత చిన్న నియోజకవర్గం భాట్‌పారా (1,17,195 మంది ఓటర్లు) కాగా, అత్యంత పెద్దది చుంచురా (2,75,715 మంది ఓటర్లు). రెండవ దశలో ఎన్నికలకు వెళ్తున్న 142 స్థానాలు ఏడు జిల్లాల్లో విస్తరించి ఉన్నాయి. ఇందులో ఉత్తర 24 పరగణాలు (33 స్థానాలు), దక్షిణ 24 పరగణాలు (31), నదియా (17), హౌరా (16) కోల్‌కతా (11), హుగ్లీ (18), పుర్బా బర్ధమాన్ (16)లు ఉన్నాయి.

# ఇంధన భయం..

మొదటిపేజీ తరువాయి

కడుతున్నారు. నిన్న, నేడు నగరవ్యాప్తంగా పెట్రోల్ బంకుల వద్ద కిలోమీటర్ల కొద్దీ క్యూ కనిపించింది. నిల్వలు తగ్గిపోవడం లేదా విపరీతమైన డిమాండ్ కారణంగా పలు పెట్రోల్ బంకులను తాత్కాలికంగా మూసివేశారు.పలు పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా డీజిల్ దొరకడం లేదు. దీనితో ఇంధనం దొరికే బంకుల్లో రద్దీ పెరుగుతోంది. వాహనదారులు సైబరాబాద్ పోలీస్ పెట్రోల్ బంకు వద్దకు బారులు తీరారు. ఈ బంకు వద్ద దాదాపు రెండు కిలోమీటర్ల మేర కార్లు వరుస కట్టాయి.

## తెలంగాణ పోలీస్ సారథి సీవీ ఆనంద్

మొదటిపేజీ తరువాయి

పనిచేస్తున్న ఆనంద్‌ను బదిలీ చేసి, ఎంపిక ప్రక్రియ అనంతరం డీజీపీగా నియమించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. యూపీఎస్సీ మార్గదర్శకాల ప్రకారం ఎంపానెల్ కమిటీ సిఫారసుల ఆధారంగా ఈ నియామకం జరిగినట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) రామక్రిష్ణరావు వెల్లడించారు. కాగా ప్రస్తుత డీజీపీ బత్తుల శివధర్‌రెడ్డి ఈనెల 30న పదవీ విరమణ చేస్తున్నారు. అదే రోజు లేదా మరుసటి రోజు (మే1న) రాష్ట్ర పోలీసు పగ్గాలను ఆనంద్ చేపట్టనున్నారని తెలిసింది. అదే సమయంలో మరికొందరు సీనియ ఐపీఎస్‌ల బదిలీలు కూడా జరిగే అవకాశం ఉందని సమాచారం.1968 జూన్ 5న హైదరాబాద్ పాతబస్తీలోని పేట్లబుర్జ్ ప్రభుత్వ ఆస్పత్రిలో జన్మించిన ఆనంద్, విద్యారంగంలోనే కాక క్రీడల్లోనూ ప్రతిభ కనబర్చారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, నిజాం కాలేజ్‌లో చదివిన ఆయన, ఉస్మానియా యూనివర్సిటీలో ఎకనామిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. యువకుడిగా హైదరాబాద్ అండర్-19 క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. 1991 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన ఆయన, కెరీర్ ప్రారంభంలోనే మావోయిస్టు ప్రభావిత జిల్లాల్లో ధైర్యవంతమైన ఆపరేషన్లతో గుర్తింపు పొందారు. నిజామాబాద్ ఎస్పీగా పనిచేసిన సమయంలో నక్సలిజాన్ని అదుపులోకి తీసుకువచ్చినందుకు ప్రెసిడెంట్ గ్యాలెంట్రీ మెడల్ అందుకున్నారు.హైదరాబాద్ నగరంలో డీసీపీగా పనిచేసిన సమయంలో గణేశ్ నిమజ్జన నిర్వహణలో వినూత్న మార్పులు తీసుకువచ్చారు. ట్రాఫిక్ అదనపు కమిషనర్‌గా ఈ-చలాన్, డ్రంక్ డ్రైవింగ్ నియంత్రణ, ఆటోమేటిక్ సిగలింగ్ వంటి పద్ధతులను ప్రవేశపెట్టి ట్రాఫిక్ నిర్వహణలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. సైబరాబాద్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో మహిళల భద్రత కోసం 'షీ టీమ్స్', సీసీటీవీల విస్తరణ వంటి కీలక చర్యలు చేపట్టారు. యాంటీ కరప్షన్ బ్యూరో (ఏసీబీ) డీజీగా, సివిల్ సప్లైస్ కమిషనర్‌గా ఉన్నప్పుడు రేషన్ వ్యవస్థలో ఈ-పాస్ యంత్రాలు, జీపీఎస్ ట్రాకింగ్ అమలు చేసి పారదర్శకతను పెంచారు

# ఇరాన్ శాంతి ప్రతిపాదనలకు రష్యా మధ్యవర్తిత్వం

మొదటిపేజీ తరువాయి

మధ్యవర్తిత్వం వహించేందుకు రష్యా సానుకూలత వ్యక్తం చేసిందని సమాచారం.

చర్చలను తిరిగి ప్రారంభించాలన్న అమెరికా అభ్యర్థనను ఇరాన్ పరిశీలిస్తోందని అరాగ్చీ తెలిపారు. తొలి విడత చర్చలు విఫలం కావడానికి అమెరికాయే కారణమని ఆయన ఆరోపించారు. ఇరాన్‌కు చెందిన రెండు చమురు నౌకలు మెజెస్టిక్ ఎక్స్, తిఫానీలను అమెరికా స్వాధీనం చేసుకోవడంపై టెహ్రాన్ విదేశాంగ శాఖ మండిపడింది. ఈ చర్య సముద్ర దోపిడీని చట్టబద్ధం చేస్తోందని ధ్వజమెత్తింది. ఇదిలావుండగా యుద్ధానికి ముగింపు పలికేందుకు, హోర్ముజ్ జలసంధిని తెరిచేందుకు ఇరాన్ అందజేసిన తాజా శాంతి ప్రతిపాదనలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జాతీయ భద్రతా బృందం సమీక్షిస్తోంది. చర్చలలో తమ అణు కార్యక్రమాన్ని ప్రస్తావించవద్దని, దానిపై తర్వాత చర్చిద్దామని ఇరాన్ సూచించింది. అయితే ఇరాన్ ప్రతిపాదనలపై ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారని, వాటిని ఆయన ఆమోదించబోరని అమెరికా మీడియాలో వార్తలు వచ్చాయి. హోర్ముజ్ జలసంధిని తక్షణమే, ఎలాంటి ఆటంకాలు లేకుండా తెరవాలంటూ పలు దేశాలు కోరుతున్నాయి. బావీఎరైన్ నేతృత్వంలో ఆయా దేశాలు ఈ మేరకు ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశాయి.

**దిగ్బంధాన్ని తప్పించుకొని హోర్ముజ్‌ను దాటుతున్న నౌకలు**

హోర్ముజ్ జలసంధిని అమెరికా నౌకాదళం దిగ్బంధించినప్పటికీ అనేక చమురు నౌకలు దానిని దాటుకొని ప్రయాణం సాగిస్తున్నాయి. గల్ఫ్ ఆఫ్ ఒమన్‌కు తూర్పు వైపున మోహరించిన అమెరికా దళాలు నౌకల రాకపోకలను నియంత్రిస్తూ, ఆంక్షలను అమలు చేస్తున్నాయి. అయితే ఇరాన్‌కు చెందిన ఖర్గ్ దీవి నుంచి నేరుగా ముంబయికి చేరుకునే మార్గం ఒకటుందని పరిశీలకులు తెలిపారు.

ఇటీవలే దేశ్ గరిమ అనే భారత నౌక జలసంధిని దాటింది. జగ్ అర్నవ్, సన్మర్ హెరాల్డ్ నౌకలపై ఇరాన్ సేనలు కాల్పులు జరిపిన రోజే దేశ్ గరిమ నౌక హోర్ముజ్‌ను దాటేసింది. అది గత బుధవారం ముంబయికి చేరుకుంది. ఖతార్‌లోని రాస్ లాఫన్ నుంచి బయలుదేరిన ఈ నౌకలో 97 వేల మెట్రిక్ టన్నుల ముడి చమురు ఉంది. ఒక్క దేశ్ గరిమ మాత్రమే కాదుఉఈ నెల 13న అమెరికా దిగ్బంధం అమలులోకి వచ్చిన రోజు నుంచి ఇప్పటి వరకూ 30కి పైగా నౌకలు హోర్ముజ్‌ను దాటాయి. వివిధ దేశాలకు చెందిన నౌకలు ఇరాన్ నుంచి ముంబయి వైపు వస్తున్నాయని వార్తలు అందుతున్నాయి. అయితే ఈ సమాచారాన్ని భారత్, టెహ్రాన్ అధికారులు ఇంకా ధృవీకరించలేదు.ఇప్పటి వరకూ 34 నౌకలు అమెరికా దిగ్బంధాన్ని దాటుకొని బయటికి వచ్చాయని ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక తెలిపింది. హోర్ముజ్ నుంచి బయటికి వచ్చిన నౌకలు పర్షియన్ గల్ఫ్‌లో ప్రవేశిస్తున్నాయని చెప్పింది. కాగా ప్రస్తుతం హోర్ముజ్‌లో ఇంకా 14 భారత నౌకలు ఉన్నాయని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు.

# భావితరాల కోసమే ఫ్యూచర్ సిటీ

మొదటిపేజీ తరువాయి

మంగళవారం మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌రాబు, జూపల్లి కృష్ణారావుతో కలిసి సీఎం శంకుస్థాపన చేశారు. మల్కాజిగిరి ఆక్టోపస్ భవనం, డీసీపీ భవనం, గచ్చిబౌలిలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ భవనాలకూ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సీఎం మాట్లాడారు. తమ ప్రభుత్వం మానవతా దృక్పథంతో ప్రజా పాలనకు కృషి చేస్తోందన్నారు. గ్రామాలను ఫ్యూచర్ సిటీలో చేర్చాలని వినతులు వస్తున్నాయని తెలిపారు. ఫ్యూచర్ సిటీ పరిధిలో ఉన్న ఆయా గ్రామాల సర్పంచులు గ్రామసభలు నిర్వహించి, గ్రామసభ పత్రాలను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి అందజేయాలని సూచించారు. అనంతరం ప్రజల ఆకాంక్షల మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ప్రపంచంలోనే ఉన్నతంగా ఉండాలనే లక్ష్యంతో ఫ్యూచర్ సిటీలో పోలీస్ కమిషరేట్ భవనం నిర్మిస్తున్నామన్నారు. ఫ్యూచర్ సిటీలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు.



**అభివృద్ధి పనుల్లో పరుగు**

60 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులు పూర్తవుతున్నాయనీ, రెండు నెలల్లో స్కిల్ భవనాన్ని ప్రారంభోత్సవం చేస్తామన్నారు. దేశంలోనే ఎక్కడా లేని 360 కిలోమీటర్ల రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టామన్నారు. రైతులకు నష్టం కాకుండా గిట్టుబాటు ధర వచ్చేటట్టు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అన్ని శాఖల అధికారులు సామాన్య ప్రజల పట్ల మానవీయ కోణంలో ఆలోచించి, తమ దగ్గరకు వచ్చిన వారి సమస్యల్ని పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

**శంషాబాద్‌లో బుల్లెట్ రైల్వేస్టేషన్**

దేశంలో ఏడు బుల్లెట్ ట్రైన్స్ మంజూరు చేస్తే మూడు మన రాష్ట్రానికే వచ్చాయనీ, బెంగళూరు- హైదరాబాద్, శంషాబాద్-పూణే, శంషాబాద్- అమరావతి-చెన్నై వరకు బుల్లెట్ ట్రైన్‌కు మార్గం సుగమమైందని వివరించారు. దీనితో రంగారెడ్డి జిల్లాలో అద్భుతం జరగబోతోందన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు దగ్గర మెట్రో రైలు, బుల్లెట్ రైలు నిర్మాణం కోసం స్టేషన్లు నిర్మిస్తామని చెప్పారు. రాష్ట్రం శాంతి భద్రతలు బాగున్నాయంటే దానికి పోలీసులే కారణమన్నారు. మిగిలిన మావోయిస్టులు జన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. ఇప్పటి వరకు 820 మంది మావోయిస్టులు లొంగి పోయారని తెలిపారు. గణపతి అనారోగ్యంగా ఉన్నారని తమకు తెలిసిందనీ, వారు లొంగిపోతే ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు.



**జూన్ 2న ఎఫ్‌టీడీసీ కార్యాలయం ప్రారంభం**

ప్రస్తుత ఫ్యూచర్‌సిటీ ప్రాంతంలో కాలుష్యా న్ని ప్రేరేపించే ఫార్మాస్యూటికల్ కంపెనీలను ఏర్పాటు చేయడానికి గత పాలకులు ప్రయత్నాలు చేశారనీ, వాటిని కాదని తాము భవిష్యత్ నగరాన్ని నిర్మిస్తున్నామన్నారు. జూన్ 2లోగా ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తామన్నారు.అనంతరం ఇక్కడి నుంచే సమీక్షలు నిర్వహించి పెట్టుబడులను ఆహ్వానిస్తామని తెలి పారు. ఫ్యూచర్‌సిటీ అభివృద్ధిలో భాగంగా నష్టపో తు న్న రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు.



**ఆదివాసీల అభివృద్ధికి పోలీస్ నిధులు : డీజీపీ శివధర్‌రెడ్డి**

కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ లొంగిపోయిన మావోయిస్టు లకు పునరావాసం కల్పించే విషయంలో టూరి జం, అటవీశాఖలతో కలిసి కొత్త వ్యూహాలు రచించి ముందుకు సాగుతున్నామని తెలిపారు. ముఖ్యం గా, తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను ఆనుకొని ఉన్న ఆరు జిల్లాలను ఇంకా సెక్యూరిటీ జోన్‌గానే ప్రభుత్వం చూడటానికి అనుమతించ డంతో ఆ నిధులను కూడా ఆదివాసీల అభివృద్ధి కోసం ఉపయోగిస్తున్నామని చెప్పారు.



# డ్రగ్స్‌కు బానిసలు కాకుండా యువతను కాపాడాలి

## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

**హనుమకొండ బ్యూరో /ఏప్రిల్ 28 (జర్నలిస్ట్ వార్త):ఐ**
డ్రగ్స్ ముప్పు యువత భవిష్యత్తును దెబ్బతీస్తోందని, వారిని మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడుకోవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. మంగళవారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కమిషనరేట్ పరిధిలోని పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తు పురోగతిపై సమగ్రంగా సమీక్షించిన కమిషనర్, కేసుల పరిష్కారంలో వేగం పెంచాలని అధికారులకు సూచించారు. స్టేషన్ వారీగా పనితీరును పరిశీలించి, పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. మూగ జీవాల అక్రమ రవాణాపై కట్టుదిట్టమైన నిఘా ఉంచాలని, ఇతర ప్రాంతాల నుంచి అక్రమంగా తరలింపులు జరగకుండా




అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్ణీత సమయాల్లో దుకాణాలు మూసివేయించేలా చర్యలు తీసుకోవాలని, సమయపాలన పాటించని యజమానులపై కేసులు నమోదు చేసి బైండోవర్ చేయాలని ఆదేశించారు. పెట్రోల్, డీజిల్ కొరతపై తప్పుడు ప్రచారాల నేపథ్యంలో పెట్రోల్ బంకుల వద్ద రద్దీ పెరుగుతున్నదని, ఎలాంటి శాంతిభద్రత సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మత్తు పదార్థాల నియంత్రణలో భాగంగా విద్యాసంస్థలు, గ్రామాలు, ప్రధాన కూడళ్లలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలను కట్టడి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం మత్తు పదార్థాల నియంత్రణతో పాటు పోక్సో కేసుల్లో నిందితులకు శిక్షలు ఖరారు చేయడంలో ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు, సిబ్బందికి నగదు బహుమతులు, ప్రశంస పత్రాలను అందజేశారు. సమావేశంలో డిసిపిలు అంకిత్ కుమార్, రాజమహేంద్ర నాయక్, దార కవిత, ట్రైనీ ఐపిఎస్ మనిషా నేహ్రా, అదనపు డిసిపిలు రవి, బాలస్వామి, సురేష్‌కుమార్, ఏసిపిలు, ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

# వేలేరు మండల కేంద్రంలో ఉపాధి హామీ పనులపై సర్పంచ్ దృష్టి

## వేసవి తీవ్రత దృష్ట్యా కూలీలకు జాగ్రత్తల సూచనలు మజ్జిగ, ఓఆర్ఎస్ పంపిణీ

**ధర్మసాగర్ /వేలేరు, ఏప్రిల్ 28 (జర్నలిస్ట్ వార్త):ఐ**
మండల కేంద్రంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మరియు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బిల్లా యాదగిరి పరిశీలించారు. పనుల్లో నిమగ్నమైన కార్మికులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో కూలీలు అనారోగ్యానికి గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా తగినంత నీరు తాగడం, మధ్యాహ్న వేళల్లో విశ్రాంతి తీసుకోవడం, తల కప్పుకోవడం వంటి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు మరియు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీల పెండింగ్ కూలి డబ్బులు త్వరలోనే వారి బ్యాంక్ ఖాతాల్లో జమ



అవుతాయని తెలిపారు. కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు గ్రామపంచాయతీ తరఫున చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.
అనంతరం గ్రామ ప్రజలతో సమావేశమై గ్రామంలో



ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సంపత్ కుమార్, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ పెద్దలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

## : మంత్రి వివేక్ వెంకటస్వామి -సంక్షేమ మండలి కమిటీ, పెన్షన్, ఈఎస్ఐ సౌకర్యాలపై హామీ

**ధర్మసాగర్ హనుమకొండ బ్యూరో, /ఏప్రిల్ 28 (జర్నలిస్ట్ వార్త):**
భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గనులు, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని మంత్రివారి నివాసంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులతో సమావేశమయ్యారు. భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధరిపల్లి చంద్రం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిన్నారపు మహేందర్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి నల్ల స్వామి, రాష్ట్ర కార్యదర్శి రాసమల్ల కొమురయ్య, జనగామ జిల్లా అధ్యక్షుడు తుడి అంజయ్య తదితరులు మంత్రిని కలిసి కార్మికుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కార్మికుల కోసం సంక్షేమ



మండలికి కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు పెన్షన్ సౌకర్యం, ఉద్యోగ భద్రత పథకాలు అందించే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గిన్నారపు మహేందర్ మాట్లాడుతూ ఈ పథకాలు అమలు చేస్తే కార్మికులు ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తారని, లేకపోతే పోరాటాలు మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో కార్మికుల పరిస్థితిని వివరించి, వారి సంక్షేమానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులు సమాజానికి అద్భుతమైన భవనాలను నిర్మిస్తున్నప్పటికీ, వారికి కనీస భద్రత, ఆశ్రయం లేకపోవడం బాధాకరమని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గత 20 ఏళ్లుగా సాగుతున్న పోరాటాల ఫలితంగా 1996 కార్మిక చట్టం అమల్లోకి వచ్చినప్పటికీ, పూర్తి స్థాయిలో ప్రయోజనాలు అందడం లేదని పేర్కొన్నారు. గత పది సంవత్సరాల పాలనలో చట్టం నిర్వీర్యమైందని, ప్రస్తుతం కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో మళ్లీ ఆశలు చిగురించాయని తెలిపారు. నిర్వీర్యం చేసిన చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి, కార్మికుల సమస్యలను సభలో ప్రస్తావించాలని మంత్రిని కోరారు.

# కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన హెచ్‌ఆర్సిసిఐ




**ఖమ్మం/, ఏప్రిల్ 28 (జర్నలిస్ట్ వార్త):**
ఖమ్మం జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన దివాకర్‌ను మానవ హక్కుల పరిరక్షణ సంస్థ (హెచ్‌ఆర్సిసిఐ) ప్రతినిధులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు శాలువాతో సత్కరించి, మొక్కను బహుకరించారు. జిల్లాలో మానవ హక్కుల పరిరక్షణకు సంస్థ చేపడుతున్న కార్యక్రమాలపై వివరాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా చైర్మన్ సంకా గణేష్, జనరల్ సెక్రటరీ సయ్యద్ షారుక్ ఇమ్రాన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ చింతల రవి, సభ్యులు నీరుడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



**సుజాతనగర్/, ఏప్రిల్ 28 (జర్నలిస్ట్ వార్త):**రైతుల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు పేర్కొన్నారు. మండలంలోని పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగా సీతారాములు మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. రైతులు పండించిన పంటలను చివరి గింజ వరకు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. “రైతే రాజు” అన్న నినాదంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, రైతుల ఆర్థికాభివృద్ధే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేష్, మాజీ సొసైటీ చైర్మన్ మండే హనుమంత్ రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు స్కూటీలు పంపిణీ

## సంతోషం వ్యక్తం చేసిన లబ్ధిదారులు

**ఎల్కతుర్తి,/ ఏప్రిల్ 28 (జర్నలిస్ట్ వార్త):**
దివ్యాంగుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో దివ్యాంగులకు స్కూటీలు పంపిణీ చేయగా లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.



పరకాల నియోజకవర్గంలోని ధర్మారం గ్రామానికి చెందిన కుమ్మరి అరుంధతీకి వికలాంగుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ వీరన్న, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా స్కూటీ అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి, పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్, అడిషనల్ కలెక్టర్ ఎన్. రవి పాల్గొన్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, దామెర సాగర్ వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు తదితరులు హాజరయ్యారు.

# అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలి

## : మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్

### ప్రతి గ్రామంలో అభివృద్ధి కమిటీలు ఏర్పాటు చేయాలి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు



**ఎల్కతుర్తి/, ఏప్రిల్ 29 (జర్నలిస్టు వార్త):**
మండలంలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా పని చేయాలని రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సూచించారు. బుధవారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశం అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాలలో తాగునీటి సౌకర్యం సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే ప్రతి గ్రామంలో అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేసి, వాటి ద్వారా విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం వంటి రంగాల్లో సేవలు మెరుగుపరచాలని సూచించారు.
ప్రత్యేకంగా రైతుల సమస్యలపై దృష్టి పెట్టాలని, కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అవస్థలు లేకుండా పగడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కమిటీకి ఒక అధికారిని బాధ్యుడిగా నియమించి, గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత తహసీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయ అధికారి తదితరులపై ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ ఎం. రవి, ఎంపీడీవో విజయ్ కుమార్, తహసీల్దార్ ప్రసాదరావు, ఐసీడీఎస్, విద్య, ఆర్డబ్ల్యూఎస్, ఉపాధి హామీ, వ్యవసాయ, అటవీ, రోడ్డు రవాణా శాఖల అధికారులు పాల్గొన్నారు.ఐ

# డీజిల్,పెట్రోల్ కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు.

## -తహశీల్దార్ నాగరాజు.

**బయ్యారం/,ఏప్రిల్ 28.(జర్నలిస్ట్ వార్త)**
డీజిల్,పెట్రోల్ కృత్రిమ కొరత సృష్టించి వినియోగదారులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని మండల తహశీల్దార్ నాగరాజు హెచ్చరించారు. బయ్యారం మండల కేంద్రంలోని అదనపు కలెక్టర్ రెవిన్యూ ఆదేశానుసారం హెచ్ పి పెట్రోల్ బంక్ ను మంగళవారం తహశీల్దార్ నాగరాజు,ఎస్ఐ ప్రశాంత్ బాబుతో కలిసి బంక్ ను తనిఖీ చేశారు. ఈ



సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం డీజిల్,పెట్రోల్ కొరత లేదని,కృత్రిమ కొరత సృష్టించడం వంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు చేపడతామన్నారు. జిల్లాలో డీజిల్, పెట్రోల్ నిల్వలు సమృద్ధిగానే ఉన్నాయని,ఈ విషయంలో వాహనదారులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అలాగే వ్యవసాయానికి సంబంధించి హార్వెస్టర్లకు,మొక్కజొన్న లారీలు, అలాగే వ్యవసాయ సంబంధిత మిషన్లకు మొదటగా డీజిల్ సప్లై కు ప్రాధాన్య ఇవ్వాలని,బంకుల్లో కేవలం వాహనాలకు మాత్రమే చమురు వేయాలని,విడిగా క్యాన్లలో,డబ్బాల్లో పోయకూడదని ఆదేశించారు. ఈ తనిఖీలో ఆర్ఐలు ఉపేందర్, సందీప్,బంక్ యజమాని వీరన్న,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో ఉన్న సీనియర్ జర్నలిస్టుకు ప్రముఖుల పరామర్శ

**వర్ధన్నపేట/ఏప్రిల్ 28(జర్నలిస్ట్ వార్త):**
వర్ధన్నపేట మండల కేంద్రానికి చెందిన ప్రముఖ సీనియర్ జర్నలిస్టు ముత్యాల సాంబయ్య మాదిగ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం మండలంలోని కట్రియాల గ్రామంలో ఉన్న సాంబయ్య నివాసానికి దళిత రత్న అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్, రాష్ట్ర నాయకులు బిర్రు మహేందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు గోలి సుధాకర్ మాదిగ, మాదిగ జర్నలిస్టు ఫోరం జిల్లా ఉపాధ్యక్షులు బిర్రు కరుణాకర్ మాదిగ తదితరులు సాంబయ్యను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎవరూ అధైర్యపడొద్దని, అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సుదీర్ఘ కాలం పాటు జర్నలిజం రంగంలో సాంబయ్య చేసిన సేవలను కొనియాడారు. ఆయన త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ పరామర్శలో పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






జర్నలిస్ట్ వార్త



# జనగణనస్వీయ నమోదును సద్వినియోగం చేసుకోవాలి

### ఆన్‌లైన్‌లో వివరాల నమోదుకు పిలుపు

### పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, మార్కెట్ చైర్మన్



**వర్ధన్నపేట/ఏప్రిల్ 28(జర్నలిస్ట్ వార్త):** భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జనగణన (సెన్సస్)–2027లో భాగంగా స్వీయ నమోదు ప్రక్రియను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం వర్ధన్నపేట ఏ.ఎస్.ఓ అరెల్లి రాజు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబిడీ రాజ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, జిల్లా సీనియర్ నాయకులు పోశాల వెంకన్న గౌడ్లు తమ వివరాలను ఆన్‌లైన్ ద్వారా స్వయంగా నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఏప్రిల్ 26 నుంచి మే 10వ తేదీ వరకు ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన వెబ్ పోర్టల్ ద్వారా ప్రతి కుటుంబం తమ గృహ, వ్యక్తిగత వివరాలను నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. స్వీయ నమోదు ద్వారా కుటుంబాల వాస్తవ పరిస్థితులు, సభ్యుల వివరాలు ప్రభుత్వానికి ఖచ్చితంగా అందుతాయని పేర్కొన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవడం వల్ల భవిష్యత్తులో ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అర్హులకు చేరడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. సమగ్ర సమాచారం అందుబాటులో ఉంటేనే అభివృద్ధి ప్రణాళికలు సమర్థవంతంగా అమలు జరుగుతాయి. ఈ కార్యక్రమంలో ఏ.ఎస్.ఓ రాజుతో పాటు పలువురు రెవెన్యూ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

# దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలి

### తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేత -రాజ్యాంగం కల్పించిన సమానత్వానికి విరుద్ధం: రెవరెండ్ అశోక్ పాల్






**వర్ధన్నపేట/ఏప్రిల్ 28(జర్నలిస్ట్ వార్త):** రాజ్యాంగంలోని అధికరణలు 14, 15, 25 ప్రకారం దళిత క్రైస్తవులకు షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) హోదాను కల్పించాలని దళిత క్రైస్తవుల ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ అశోక్ పాల్ డిమాండ్ చేశారు. మంగళవారం వర్ధన్నపేట తహశీల్దార్ విజయ్ సాగర్‌కు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మండల కేంద్రంలోని ఎన్.ఐ.సి.జి.ఓ చర్చిలో నియోజకవర్గ చైర్మన్ బిషప్ ఫిర్మీయతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. దళితులు ఇతర మతాలను అనుసరిస్తున్నప్పుడు లభించే ఎస్సీ హోదాను, కేవలం క్రైస్తవ మతాన్ని స్వీకరించిన వారికి నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధమని అశోక్ పాల్ పేర్కొన్నారు. మతం మారినంత మాత్రాన ఒక వ్యక్తి సామాజిక స్థితిగతులు లేదా వారిపై జరిగే వివక్షలు మారిపోవు. మతం పేరుతో ఎస్సీ ఫలాలను నిలిపివేయడం రాజ్యాంగం కల్పించిన చట్టం ముందు సమానత్వం (అధికరణ 14), వివక్షపై నిషేధం (అధికరణ 15)లను ఉల్లంఘించడమే" అని స్పష్టం చేశారు. నచ్చిన మతాన్ని ఆచరించే స్వేచ్ఛను రాజ్యాంగంలోని 25వ అధికరణ కల్పిస్తోందని, అయితే మతం మారితే హక్కులు కోల్పోతారనే భయం కల్పించడం ఆ స్వేచ్ఛకు విఘాతం కలిగించడమేనని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి దళిత క్రైస్తవులకు రాజ్యాంగపరమైన హక్కులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు సంగాల జయప్రకాష్, కరుణాకర్, సంపత్, ప్రకాష్, జీవన్, ప్రవీణ్, స్టీవెన్, ఇమ్మడి ఆంధ్రయ మరియు నియోజకవర్గంలోని పలువురు క్రైస్తవ మత పెద్దలు పాల్గొన్నారు

# బాధిత కుటుంబాలకు అండగా.. బియ్యం పంపిణీ



**రాయపర్తి/, ఏప్రిల్ 28 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని జయరాం తండా (ఎస్) గ్రామంలో అనారోగ్య కారణాలతో మృతి చెందిన గుగులోత్ అమ్మి, గుగులోత్ మాజీ, జాటోత్ వాళ్య, గుగులోత్ అమ్మ, గుగులోత్ మంగమ్మ కుటుంబాలను సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు, బిఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి బాధిత కుటుంబాలకు అండగా నిలిచారు. ప్రతి కుటుంబానికి 50 కిలోల బియ్యం, నూనె డబ్బా అందజేసి సహాయం చేశారు. ఇలాంటి క్లిష్ట సమయంలో పార్టీ తరఫున అన్ని విధాలా సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లేతాకుల రంగారెడ్డి, ఐత రామ్ చందర్, సంకినేని ఎల్లస్వామి, చిలువేరు సాయి గౌడ్, ఐత జంపి, సాయి కిరణ్, బోయిని అనిల్, సర్పంచ్ గుగులోత్ రమేష్, ఉపసర్పంచ్ గోవింద్, బాధవత్ బాలు, బాధవత్ సుమన్, బాధవత్ బద్రు తదితరులు పాల్గొన్నారు.

# మత్తుకు దూరం.. భవితకు ప్రాణం

### సే నో టు డ్రగ్స్ వారోత్సవాల్లో జిల్లా కలెక్టర్

### ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి

### విద్యార్థులతో భారీ ర్యాలీ, ప్రతిజ్ఞ




**వర్ధన్నపేట/ఏప్రిల్ 28(జర్నలిస్ట్ వార్త):** ప్రజా పాలన , ప్రగతి ప్రణాళిక"లో భాగంగా నిర్వహిస్తున్న చైల్డ్ సేఫ్టీ అండ్ ప్రొటెక్షన్ – సే నో టు డ్రగ్స్, వారోత్సవాలు వర్ధన్నపేటలో ఘనంగా జరిగాయి. మంగళవారం స్థానిక మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన అవగాహన సభకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి పాల్గొని యువతకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత దేశానికి వెన్నెముక అని, మత్తు పదార్థాల బారిన పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. డ్రగ్స్ వినియోగం వల్ల వ్యక్తిగత ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి మాట్లాడుతూ యువతను పెడదారి పట్టకుండా చూసేందుకు ప్రభుత్వం ఇలాంటి అవగాహన కార్యక్రమాలు చేపట్టడం శుభపరిణామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ వారికి సరైన మార్గదర్శనం చేయాలని సూచించారు. విద్యాసంస్థల్లో నిరంతరం అవగాహన కల్పించడం ద్వారానే డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించగలమని తెలిపారు. అనంతరం విద్యార్థులతో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ వద్దు – జీవితమే ముద్దు అనే నినాదాలతో పట్టణ వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. అధికారులు పిల్లల రక్షణ చట్టాలు, భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, డీఎంహెచ్ఓ సాంబశివరావు, తహసీల్దార్ విజయ్ సాగర్, మున్సిపల్ కమిషనర్ ఇ. జోనా, ఎంపీడీఓ వెంకటరామణ, ఎస్సై రాజు, విద్యాశాఖ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, రిసోర్స్ పర్సన్లు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతు ముంగిట శాస్త్రవేత్తలు.. శాస్త్రీయ సాగుపై అవగాహన






**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, ఏప్రిల్ 28 (జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైతు ముంగిట శాస్త్రవేత్తలు' కార్యక్రమం విజయవంతంగా సాగింది. వానాకాలం సాగుకు రైతులను సిద్ధం చేయడంతో పాటు శాస్త్రీయ పద్ధతులపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. బి. రాజు మాట్లాడుతూ మార్కెట్లో డిమాండ్ ఉన్న సన్న రకం వరి వంగడాల సాగుపై రైతులకు సూచనలు ఇచ్చారు. ఎరువులను అధికంగా వాడకుండా, పచ్చిరొట్ట ఎరువులు వినియోగించడం ద్వారా భూసారం పెంచుకోవచ్చని తెలిపారు.
టీచింగ్ అసోసియేట్ డా. ఎన్. రమ్యశ్రీ మాట్లాడుతూ రసాయన మందుల వినియోగాన్ని తగ్గించి సమగ్ర సస్యరక్షణ పద్ధతులను అనుసరించాలని సూచించారు. పర్యావరణం, ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా ప్రకృతి అనుకూల విధానాలకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఆయిల్ ఫెడ్ జిల్లా అధికారి ఎస్. శంకర్ ఆయిల్ పామ్ పంట సాగు, అందుబాటులో ఉన్న రాయితీలు, అంతర పంటలు, తెగుళ్లు, పురుగుల నివారణ చర్యలపై వివరించారు.
కార్యక్రమంలో సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియ, వ్యవసాయ అధికారి రాజేష్, ఏఈఓ దివ్య, ఫీల్డ్ అధికారి సాయికిరణ్ తదితరులు, రైతులు పాల్గొన్నారు.

# వరి పంటలో రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి

### రైతు ముంగిట శాస్త్రవేత్తల సూచనలు



**రాయపర్తి,/ ఏప్రిల్ 28 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని గన్నారం గ్రామంలో రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ పి. గోన్లా నాయక్ మాట్లాడుతూ వరి పంటలో రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని రైతులకు సూచించారు.
వానాకాలం సాగుకు అనువైన పలు విత్తన రకాలను సాగు చేస్తే మంచి దిగుబడితో పాటు ప్రోత్సాహక ధనం పొందవచ్చని తెలిపారు. నీటి ఆదా, యూరియా వినియోగం నియంత్రణ, అవసరమైన మేరకే రసాయనాల వినియోగంపై అవగాహన కల్పించారు. పంటల కోత అనంతరం అవశేషాలను కాల్చడం వల్ల కార్బన్ డయాక్సైడ్ వాతావరణంలోకి చేరి కాలుష్యం పెరుగుతుందని హెచ్చరించారు. అవశేషాలను పొలంలోనే కలియదున్నితే అవి కుళ్ళి సేంద్రియ ఎరువులుగా మారి భూమి సారాన్ని పెంచుతాయని వివరించారు. ఎకరాకు తగిన మోతాదులో ఎరువులు వేసి అవశేషాలను కలిపితే కాలుష్యం తగ్గించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వీరభద్రం, సర్పంచ్ గడ్డం విజయసమ్మయ్య, వ్యవసాయ విస్తరణ అధికారి కావ్య, పంచాయతీ కార్యదర్శి కరుణశ్రీ, మేడ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.ం

# వ్యసనాలపై పోరు.. ఇన్‌స్పెక్టర్‌కు గౌరవం

### చిన్నారులు, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ -పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా



**గీసుగొండ/ఏప్రిల్ 28(జర్నలిస్ట్ వార్త):** సమాజంలో వేళ్లూనుకుంటున్న చెడు వ్యసనాలను నిర్మూలించేందుకు నిబద్ధతతో పనిచేస్తున్న గీసుగొండ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డి. విశ్వేశ్వర్ కృషికి తగిన గుర్తింపు లభించింది. విద్యార్థులు, చిన్నారులు గుట్కా, పొగాకు వంటి ప్రమాదకర వ్యసనాల బారిన పడకుండా ఆయన చేస్తున్న నిరంతర పోరాటాన్ని గుర్తిస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మంగళవారం ఆయనకు ప్రశంసాపత్రంతో పాటు నగదు పురస్కారాన్ని అందజేసి అభినందించారు. పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో నిషేధిత పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై విశ్వేశ్వర్ ఉక్కుపాదం మోపారు. కేవలం విధుల్లో భాగంగానే కాకుండా, సామాజిక బాధ్యతగా భావించి విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహించి విద్యార్థులకు వ్యసనాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ చర్యలు యువత పెడదారి పట్టకుండా ఉండటంలో కీలక పాత్ర పోషించాయని ఉన్నతాధికారులు కొనియాడారు. ఒక అధికారి తన బాధ్యతతో పాటు సామాజిక శ్రేయస్సును కాంక్షించినప్పుడు సమాజంలో మార్పు సాధ్యమవుతుంది. విశ్వేశ్వర్ గారు తీసుకున్న చర్యలు పోలీసు వ్యవస్థపై ప్రజల్లో మరింత నమ్మకాన్ని పెంచాయి. ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వర్ మాట్లాడుతూ సన్‌ప్రీత్ సింగ్, పోలీస్ కమిషనర్ తన సేవలను గుర్తించి ప్రశంసాపత్రం, నగదు పురస్కారం అందించడం సంతోషంగా ఉందని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో గీసుగొండ పరిధిని వ్యసన రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు మరింత కష్టపడతానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# స్నేహితుడి వివాహంలో సందడి చేసిన నారపోగు విజయ్



**తల్లాడ, /ఏప్రిల్ 28 (జర్నలిస్ట్ వార్త):** మండల పరిధిలోని రామచంద్రపురం గ్రామంలో జరిగిన స్నేహితుడి వివాహ వేడుకలో నారపోగు విజయ్ పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా తడికమళ్ళ బాలు దంపతులను కలిసి ఆశీర్వదించారు. వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసిన ఆయన, సుఖసంతోషాలతో దాంపత్య జీవితం కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్నేహితులు, బంధువులు పాల్గొని ఆనందంగా వేడుకను జరుపుకున్నారు.

# గ్రామాభివృద్ధికి కమిటీలు..

### పకడ్బందీగా పని చేస్తాం ,చెట్లపల్లి రమేష్ వెల్లడి

**ఎల్కతుర్తి/, ఏప్రిల్ 28 (జర్నలిస్ట్ వార్త):**



మండలంలోని దోమల గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడానికి కమిటీలు ఏర్పాటు చేసినట్లు గ్రామానికి చెందిన చెట్లపల్లి రమేష్ తెలిపారు. పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు విద్యా వ్యవస్థను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ కమిటీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు కమిటీలు కీలకంగా పనిచేస్తాయని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరించే దిశగా సమన్వయంతో ముందుకు సాగుతామని తెలిపారు.కమిటీ ఏర్పాటు పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కూడా కట్టుబడి పనిచేస్తామని చెట్లపల్లి రమేష్ స్పష్టం చేశారు.

# తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలి

### రైతన్న వెతలు తీర్చాలి -బీజేపీ సత్తుపల్లి మండల అధ్యక్షుడు సాలి శివకృష్ణ



**సత్తుపల్లి/, ఏప్రిల్ 28 (జర్నలిస్ట్ వార్త):**
సత్తుపల్లి మండలంలో వరి ధాన్యం కొనుగోళ్లు ఆలస్యమవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు సాలి శివకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పర్యటనలో పలువురు రైతులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు.మండలంలోని రేజర్ల సొసైటీ పరిధిలో రైతులు గత ఇరవై రోజులుగా ఎండలోనూ, వానలోనూ కష్టపడి వరి ధాన్యాన్ని ఎండబెట్టి కొనుగోలు కేంద్రాల వద్ద రాశులుగా పోసి ఎదురుచూస్తున్నప్పటికీ ఇప్పటివరకు కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడం బాధాకరమని తెలిపారు. నెలరోజుల క్రితమే కేంద్రాలు ప్రారంభమైనప్పటికీ ఒక్క గింజ కూడా కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.ఈ నేపథ్యంలో వెంటనే సంబంధిత అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే తహసీల్దార్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రైతుల తరఫున పోరాటం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కిషన్ మోర్చా మండల అధ్యక్షుడు భీమరెడ్డి సత్యనారాయణ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వేముల లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు సాలి కృష్ణస్వామి, జిల్లా నాయకుడు చీకటి వసంతరావు, సీనియర్ నాయకుడు గొర్ల మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాలల సంరక్షణకు తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి

### -జిల్లా బాలల సంరక్షణ అధికారి నరేష్.



**బయ్యారం/,ఏప్రిల్ 28.(జర్నలిస్ట్ వార్త)**
జిల్లాలో బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో 99 రోజుల ప్రణాళికలో భాగంగా మంగళవారం బయ్యారం కస్తూరిబా గాంధి బాలికల పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి బోలగని నరేష్ పాల్గొని మాట్లాడుతూ యుక్త వయసులో బాలికలు శారీరక మానసిక మార్పుల గురించి వివరించారు.బాలికలు తాత్కాలిక ఆకర్షణకు లోనై ప్రేమ పేరుతో మోసపోతున్న వారిని ఏ విధంగా గుర్తించాలో అంగన్వాడీ టీచర్లకు బాలికలకు వివరించారు.ప్రస్తుతం యువత సోషల్ మీడియా మాధ్యమాలలో త్వరగా ఆకర్షితులై చదువుకునే బాలికల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.పిల్లలకు వ్యాయామం,యోగా,ఇతర ఆటల పట్ల శ్రద్ధ వహించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎవరైనా ప్రేమ పేరుతో వెంటపడితే 1098కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్ కుమార్,జగ్గు తండ సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణ,ఉప సర్పంచ్ గుంజ వీరస్వామి,చైల్డ్ లైన్ సూపర్ వైజర్ కళ్యాణి,నర్మద, ఆశా సిబ్బంది, తల్లిదండ్రులు,తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రమంత్రి రాజీవ్ రంగన్ సింగ్‌తో వాకిటి భేటీ

### రాష్టానికి రావాల్సిన సాయం తదితర అంశాల ప్రస్తావన

**హైదరాబాద్,ఏప్రిల్ 28.(జర్నలిస్ట్ వార్త)** కేంద్రమంత్రి రాజీవ్ రంగన్ సింగ్‌తో వాకిటి శ్రీహరి భేటీ సందర్భంగా రాష్ట్రానికి రావాల్సిన సాయం తదితర అంశాలను ప్రస్తావించారు. రాజేంద్ర నగర్ లోని జాతీయ ఫిషరీస్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో కేంద్ర పశుసంవర్ధక పాడి పారిశ్రామికాభివృద్ధి మత్స్య శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌తో యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మత్స్య శాఖ డైరెక్టర్ నిఖిల, పశు సంవర్ధక శాఖ అధికారి లక్ష్మీ నారాయణ తదితరులు ఆయన వెంట ఉన్నారు. పశు సంవర్ధక, పాడి, మత్స్య శాఖల్లో తెలంగాణ అమలు చేస్తున్న పథకాలను కేంద్రమంత్రికి మంత్రి వాకిటి శ్రీహరి వివరించారు. కేంద్రం నుంచి తెలంగాణకు సహకారం ఇవ్వాలని కేంద్రమంత్రిని కోరారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ను శాలువా, పూల బోకే, మెమోటెంతో ఘనంగా సన్మానించిన మంత్రి వాకిటి శ్రీహరి రాష్ట్రానికి కేంద్రం నుంచి కావలసిన సహకారం, ఆక్వా కల్చర్, లైఫ్ సైన్సెస్ లో ఇన్సూరెన్స్, మోపెడ్ కేటాయింపుల్లో న్యాయం వంటి పలు అంశాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.గోదావరి, కృష్ణా నదుల మధ్య ఉన్న 46 వేల పెద్ద చెరువులు, 26 వేల చిన్న చెరువులు, 100 రిజర్వాయర్ల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వం కేంద్రం నుంచి వచ్చే నిధులను తీసుకు రావడంలో విఫల మయింది.రాజేంద్ర నగర్ లో ఉన్న ఎన్ఎఫ్‌డిసిని తరలించమని కేంద్రమంత్రి హామీ ఇచ్చారని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.

# అహం బ్రహ్మాస్మి

## - నీలో నిన్ను వెతుకో్క!

### నాకు నేను అమ్మ... నాకు నేను నాన్న... నాకు నేనే భర్త, లవర్... నాకు నేనే సర్వం!



ఈ మాటలు వినడానికి విప్లవాత్మకంగా అనిపించవచ్చు, కానీ ఇవి మనిషి తన అంతరాత్మతో జరిపే గొప్ప సంభాషణకు ప్రతిరూపాలు. బాహ్య ప్రపంచంలో బంధాల కోసం, భద్రత కోసం వేటాడుతున్న ఆధునిక మానవుడికి, తనలోనే ఒక అనంతమైన ప్రపంచం దాగి ఉందనే సత్యాన్ని ఇవి గుర్తుచేస్తున్నాయి.

### అనంతమైన ఆత్మవిశ్వాసం


సాధారణంగా మనిషి పుట్టినప్పటి నుండి మరణించే వరకు ఏదో ఒక ఊతం కోసం వెతుకుతూనే ఉంటాడు. చిన్నప్పుడు తల్లిదండ్రుల వేలు పట్టుకుని నడక నేర్చుకున్న మనం, పెరిగే కొద్దీ స్నేహితులు, భాగస్వాములు, పిల్లలు. ఇలా ఎందరో వ్యక్తుల మీద ఆధారపడతాం. కానీ, జీవితం ఇచ్చే అనూహ్య మలుపుల్లో ఒక్కోసారి అందరూ దూరమవ్వచ్చు. అప్పుడు మిగిలేది నేను అనే ఏకైక శక్తి మాత్రమే. మనకు మనమే అమ్మగా మారి మనలోని లోపాలను క్షమించుకోవాలి. మనకు మనమే నాన్నగా మారి మనల్ని సరైన మార్గంలో నడిపించుకోవాలి. బయటి వ్యక్తి ఇచ్చే ప్రేమ కంటే, మన మీద మనకు ఉండే ఆత్మప్రేమ మిన్న. మనల్ని మనం ప్రేమించుకున్నప్పుడే, ఇతరులకు ప్రేమను పంచగల స్థాయికి ఎదుగుతాం.

### భయం.. ధైర్యం.. రెండు నీవే!

మనిషికి అతిపెద్ద శత్రువు భయం. అది బయట ఎక్కడో ఉండదు, మన ఆలోచనల్లోనే ఉంటుంది. అదే సమయంలో, ఆ భయాన్ని పోగొట్టే ధైర్యం కూడా మన గుండెల్లోనే నిక్షిప్తమై ఉంటుంది.
నీ బలహీనతే నీ భయం.నీ సంకల్పమే నీ ధైర్యం.
నీకు నువ్వే సర్వస్వం అనుకున్నప్పుడు, లోకం నిన్ను చూసి భయపడదు. గౌరవిస్తుంది. ఒంటరితనాన్ని భారంగా భావించకుండా, దాన్ని ఏకాంతం అనే వరంగా మార్చుకున్న రోజే మనిషి అసలైన విజేత అవుతాడు.

### అంతర్గత ప్రయాణం...

సంబంధ బాంధవ్యాలు సమాజానికి అవసరమే, కానీ అవి నీ అస్తిత్వాన్ని శాసించకూడదు. నీ కన్నీళ్లు తుడవడానికి ఒక చెయ్యి కావాలనుకున్నప్పుడు, నీ భుజంపై నీవు తల వాల్చుకోగలిగే శక్తిని సంపాదించుకోవాలి. ఈ విశ్వమంతా నీలోనే ఉంది. నీ గమ్యం నీవే, నీ గమనం నీవే. చివరగా.నిన్ను నువ్వు నమ్మిన రోజున, నిన్ను నువ్వు గెలిచిన రోజున. ఈ ప్రపంచం నీ పాదాల చెంత ఉంటుంది. ఎందుకంటే, నీకు నీవే సర్వం.



**బిర్రు కరుణాకర్**
జర్నలిస్ట్ వార్త ఎడిటర్, సీనియర్ జర్నలిస్ట్

### సిక్కిం ఆవిర్భావ దినోత్సవం

# పిల్లలతో కలసి ఫుట్‌బాల్ ఆడిన ప్రధాని

**న్యూఢిలీఏప్రిల్ 28.(జర్నలిస్ట్ వార్త)** నరేంద్ర మోదీ సిక్కిం రాష్ట్ర రాజధాని గ్యాంగ్‌టక్‌లో సందడి చేశారు. యువతతో కలిసి ఫుట్‌బాల్ ఆడుతూ ఉల్లాసంగా గడిపారు. సిక్కిం రాష్ట్ర అవతరణ జరిగి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వేడుకలు జరుగుతున్నాయి. మంగళవారం జరగబోయే ముగింపు వేడుకల కోసం ప్రధాని గ్యాంగ్‌టక్ చేరుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఫుట్‌బాల్ ఆడారు. సిక్కిం 50వ అవతరణ దినోత్సవం సందర్భంగా ఆ రాష్ట్రంలో పర్యటిస్తున్న ప్రధాని మంగళవారం ఉదయం అక్కడి క్రీడాకారులతో కలిసి సరదాగా ఫుట్‌బాల్ ఆడారు. ఈ ఆటకు సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. గ్యాంగ్‌టక్‌లో యువ మిత్రులతో కలిసి ఆడడం చాలా ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. ప్రధాని స్పోర్ట్స్ దుస్తుల్లో పిల్లలతో కలిసి ఆనందంగా ఫుట్‌బాల్ ఆడుతున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సిక్కిం 50వ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ ముగింపు కార్యక్రమానికి మోదీ హాజరై.. రూ.4,000 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ఆవిష్కరించారు. ఆ రాష్ట్రం భారత యూనియన్‌లో చేరి 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని




నిర్వహించారు. అనంతరం రోడ్‌షోలో పాల్గొన్నారు.
అధికారిక కార్యక్రమాలకు ముందు గ్యాంగ్‌టక్‌లో యువతతో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. ఈ సందర్భంగా తీసిన ఫొటోలు, వీడియోలను ప్రధాని తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకోవడంతో అవి వేగంగా వైరల్ అయ్యాయి. యువతతో కలిసి క్రీడల్లో పాల్గొనడం తనకు ప్రత్యేక అనుభూతినిచ్చిందని ప్రధాని పేర్కొన్నారు. 'గ్యాంగ్‌టక్‌లో ఉదయం యువ



స్నేహితులతో కలిసి ఫుట్‌బాల్ ఆడడం చాలా ఎనర్జీ ఇచ్చిందని మోదీ పేర్కొన్నారు. కాగా, సిక్కింలో ప్రధాని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయబోతున్నారు. సిక్కింలో రహదారుల కనెక్టివిటీ, ఆరోగ్యం, టూరిజం, విద్య, నగర అభివృద్ధి సహా వివిధ రంగాల్లో రూ.4,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించనున్నారు.

# వివాదంలో అషురెడ్డి వ్యవహారం

**హైదరాబాద్,ఏప్రిల్ 28.(జర్నలిస్ట్ వార్త)**
బిగ్ బాస్ ఫేమ్, ప్రముఖ సినీనటి అషురెడ్డి చుట్టూ వివాదాలు ముదురుతున్నాయి. పెళ్లి పేరుతో తనను, తన కుటుంబాన్ని నమ్మించి దాదాపు రూ. 9.83 కోట్లు మోసం చేసిందంటూ బాధితుడు ధర్మేంద్ర కుటుంబం ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఆమెపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ అషురెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. బాధితుడు ధర్మేంద్ర తండ్రి సత్యనారాయణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం ఈ కేసులోని ప్రధానాంశాలు ఇలా ఉన్నాయి. అషురెడ్డి, ధర్మేంద్ర వివాహం చేసుకోవాలని అనుకున్నారని వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో ప్రముఖ జ్యోతిష్కుడు వేణుస్వామి వద్దకు వెళ్లి ఇరు కుటుంబాలు జాతకాలు కూడా చూపించాయని ప్రచారం జరుగుతోంది. పెళ్లి సాకుతో అషురెడ్డి తన వద్ద నుంచి సుమారు రూ. 9.83 కోట్లు వసూలు చేసిందని ధర్మేంద్ర ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా, ఆమె సోదరి దివ్యారెడ్డికి కూడా రూ. 50



లక్షలు ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పెళ్లికి అన్నీ సిద్ధమవుతున్న తరుణంలో అషురెడ్డి అకస్మాత్తుగా ధర్మేంద్రను వివాహం చేసుకోవడానికి నిరాకరించినట్లు సమాచారం. అషురెడ్డి తనను మానసికంగా, ఆర్థికంగా వేధించిందని బాధితుడు ధర్మేంద్ర పేర్కొన్నారు. అషురెడ్డి అవసరాల కోసం తాను పలు బ్యాంకుల నుంచి లోన్‌లు తీసుకుని మరీ ఖర్చు చేశానని తెలిపారు. ఇప్పుడు ఆ లోన్‌లు తీర్చలేక ఇబ్బంది పడుతున్నానని ధర్మేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే, తనపై తిరిగి కేసు పెడతానని లేదా ఆత్మహత్య చేసుకుంటానని అషురెడ్డి బెదిరిస్తోందని ఆయన ఫిర్యాదులో తెలిపారు. తన బాయ్‌ఫ్రెండ్ జయంత్‌తో కలిసి అషురెడ్డి ఈ డ్రామా ఆడిందని, తనను మోసం చేసిందని బాధితుడు వాపోతున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అషురెడ్డి కుటుంబంపై పోలీసులు కఠినమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నేరానికి పాల్పడటం వంటి సెక్షన్ల కింద నాన్ బెయిలబుల్ కేసు నమోదైంది. అయితే తనపై వస్తున్న ఆరోపణలను అషురెడ్డి తోసిపుచ్చారు. ఈ మేరకు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. కనీసం తన వెర్షన్ తీసుకోకుండానే పోలీసులు ఏకపక్షంగా కేసు నమోదు చేశారని ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. తనపై నమోదైన కేసులో వాస్తవం లేదని, కాబట్టి ఆ కేసును వెంటనే కొట్టివేయాలని ఆమె కోర్టును వేడుకున్నారు. ఈ కేసు ఇప్పుడు న్యాయస్థానం పరిధిలో ఉంది. రెండు నెలల క్రితమే ఫిర్యాదు చేసినా, ఇప్పుడు ఈ వ్యవహారం వెలుగులోకి రావడం చర్చనీయాంశమైంది. అషురెడ్డి పిటిషన్‌పై హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.